రోడ్డుపైనే ఇసుక లారీలు

- లారీల రాకపోకలతో రోడ్ల ధ్వంసం
- ఇబ్బందులు పడుతున్న భక్తులు


హేమాచల క్షేత్రానికి వెళ్లే రోడ్డుపై పార్కింగ్ చేసిన లారీలు


కుంగిన సైడ్ బర్మ్

మంగపేట : మండలంలోని మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై ఇసుక లారీల పార్కింగ్‌తో భక్తులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. మూడ్రోజుల నుంచి హేమాచల క్షేత్రానికి వెళ్లే ప్రధాన రోడ్డుపై రెండున్నర కిలోమీటర్ల వరకు వందలాది ఇసుక లారీలు పార్కింగ్ చేసి ఉండటంతో ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అలాగే రోడ్డు బీటీ రోడ్డు ధ్వంసమై సైడ్ బర్మ్ కుంగిపోయింది. మల్లూరు ఇసుక క్వారీకి లోడింగ్ కోసం వచ్చే ఇసుక లారీలను గతంలో ఏటూరు నాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై నిలిపే వారు. ఇటీవల ఇసుక క్వారీ ప్రారంభం కావడంతో లారీలను ప్రధాన రోడ్డుపై పార్కింగ్ చేశారు. నిత్యం ఆలయానికి వచ్చే భక్తులకు ఇబ్బంది కలిగే విధంగా లారీలను నిలిపి వేసినా ప్రశ్నించే వారు లేక పోవడంతో రోడ్డును పార్కింగ్ కోసం క్వారీ నిర్వాహకులు వినియోగిస్తుండటం విశేషం. సైడ్ బర్మ్‌లు, కల్వర్టుల వద్ద రోడ్డు కుంగిపోవడంతో ప్రమాదకరంగా తయారైందని భక్తులు వాపోతున్నారు. గత ఏడాది మండలంలోని మల్లూరు, చుంచుపల్లి, వాడగూడెం, రాజుపేట ఇసుక క్వారీలకు వచ్చే వేలాది లారీలు ప్రధాన రోడ్డుపై నిలిపి ఉండడం, సామర్థ్యానికి మించి ఇసుకను తరలించడంతో మల్లూరు నుంచి రాజుపేట వరకు పది కిలోమీటర్ల మేర రోడ్డు సైడ్ బర్మ్‌లు, కల్వర్టుల వద్ద కుంగి పోయి ప్రమాదకరంగా గుంతలు ఏర్పడ్డాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఇసుక లారీలను రోడ్డుపై నిలుపకుండా చర్యలు తీసుకోవాలని లేనట్లయితే రోడ్లు పూర్తిగా ధ్వంసం కావడంతో పాటు ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఏఎస్పీ ఆదేశాలు బేఖాతర్..

రోడ్లపై ఇసుక లారీలను నిలిపితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏటూరునాగారం ఏఎస్పీ హెచ్చరించినా యథావిధిగా ప్రధాన రోడ్లపై లారీలను నిలిపి ఉంచడం గమనార్హం. ఏటూరునాగారం టీఎంఎస్ఎండీసీ పీఓ, మల్లూరు ఇసుక క్వారీ నిర్వాహకులు, పోలీస్ సిబ్బంది సమావేశంలో ఏటూరునాగారం ఏఎస్పీ శివం ఉపాధ్యాయ మంగళవారం మాట్లాడారు. ఇసుక క్వారీలకు వచ్చే లారీలకు ప్రత్యేక పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పార్కింగ్ లేకుండా రోడ్లపై లారీలను నిలిపి ట్రాఫిక్‌కు, ప్రజలకు అంతరాయం కలుగుతుందన్నారు. రోడ్లపై లారీలను నిలిపితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ హెచ్చరించారు. అయినప్పటికీ బుధవారం సైతం మల్లూరుగుట్టకు వెళ్లే రోడ్డుతో పాటు గ్రామంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై లారీలను నిలిపి ఉంచడం గమనార్హం.

వరదలపై అప్రమత్తంగా ఉండాలి


అవగాహన కల్పిస్తున్న ఎన్‌డీఆర్ఎఫ్ సభ్యులు

వాజేడు : మండల పరిధిలోని రాష్ట్ర సరిహద్దులో గల టీకులగూడెం గ్రామస్తులకు ఎన్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందం అధికారులు, వాజేడు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడుతో కలిసి బుధవారం గోదావరి వరదలపై అవగాహన కల్పించారు. వరదలు రాక ముందు ఎలా ఉండాలి, వరదలు వస్తున్న సమయంలో ఎలా అప్రమత్తం కావాలి, చిక్కుకుంటే ఎలా రక్షణ కల్పించుకోవాలి వంటి అంశాలను వివరించారు. ఈ సందర్భంగా టీకులగూడెం గ్రామస్తులకు జాగ్రత్తలు తెలియజేశారు. ఎన్‌డీఆర్ఎఫ్ ప్రత్యేక బృందం అధికారులు, ఇన్‌స్పెక్టర్ ముకేష్ కుమార్, ఏఎస్సై సుధీర్, కానిస్టేబుల్ జగదీశ్ తదితరులు ఉన్నారు.

మహిళలు అభివృద్ధిలో ముందుండాలి


ఏటూరునాగారం : సంబురాల్లో పాల్గొన్న మహిళలు, సెర్ప్ సిబ్బంది

వాజేడు : మహిళలు అభివృద్ధిలో ముందుండాలని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు అన్నారు. మండల పరిధిలోని రేగులపాడు గ్రామంలో బుధవారం ఇందిర మహిళా శక్తి సంబురాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలు పారిశ్రామికంగా ముందుగు సాగాలని సూచించారు. ఏఈఓ రాధిక, వీఓ రజని, నాగమణి, సత్యనారాయణ ఉన్నారు.

మహిళా శక్తి సంబురాలు

ఏటూరునాగారం : మహిళలు పొదుపు చేస్తేనే కుటుంబం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని సెర్ప్ ఏపీఎం సతీష్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఇందిర మహిళా శక్తి సంబురాల్లో భాగంగా పోటీలు ఆటపాటలతో సంబురాలను జరుపుకున్నారు. ప్రతి కుటుంబం ఆర్థికాభివృద్ధి, ఎదుగుదల మహిళలతోనే సాధ్యం అవుతుందన్నారు. కార్యక్రమంలో జ్యోతి, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

రైతులకు పరిహారం చెక్కుల పంపిణీ


చెక్కు అందజేస్తున్న ఏఓ నవీన్

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని పాత్రాపురం, ఆలుబాక రైతు వేదికల్లో బుధవారం మొక్కజొన్న పంట నష్టపోయిన రైతులకు మండల వ్యవసాయ అధికారి నవీన్ పరిహారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో మొక్కజొన్న పంట నష్ట పోయిన రైతులకు కంపెనీల నుంచి మంజూరైన పరిహారం చెక్కులను రైతులకు అందజేస్తున్నట్లు తెలిపారు. ఏఈఓలు శ్యామ్, శ్రీకన్య రైతులు ఉన్నారు.

నోట్‌బుక్స్ పంపిణీ



వాజేడు : మండల పరిధిలోని బొల్లారం గ్రామంలో గ్రేస్ సేవా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం పేద విద్యార్థులకు పలకలు, నోట్‌బుక్స్, బ్యాగ్స్ పంపిణీ చేశారు. 63 మందికి సంస్థ సూపర్ వైజర్ మురళీరెడ్డి, కంతి శ్యామ్ సామగ్రి అందించారు.

ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకం


బీఎల్‌ఓలతో తహసీల్దార్, నాయబ్ తహసీల్దార్

కాటారం : ఓటరు నమోదులో బీఎల్‌ఓలు కీలకమని తహసీల్దార్ నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో బుధవారం బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటరు నమోదు ప్రక్రియ, జాబితా సవరణ తదితర అంశాలపై నాయబ్ తహసీల్దార్ రామ్మోహన్ బీఎల్‌ఓలకు వివరించారు. నూతన ఓటరు నమోదు ప్రక్రియ సక్రమంగా చేపట్టాలని బూత్ లెవల్‌లో ఓటరు జాబితా పక్కాగా ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

నేడు బీఎల్‌ఓలకు శిక్షణ

వాజేడు : మండల కేంద్రంలోని రైతువేదికలో భద్రాచలం ఆర్డీఓ ఆదేశాల మేరకు నేడు (గురువారం) బీఎల్‌ఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. భద్రాచలం నుంచి మాస్టర్ ట్రెయినర్ శిక్షణ ఇవ్వడానికి వస్తున్నట్లు, వాజేడు, వెంకటాపురం(కె) మండలాలకు చెందిన బీఎల్‌ఓలు తప్పని సరిగా హాజరు కావాలని సూచించారు. శిక్షణ మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 5:30 వరకు ఉంటుందని తెలిపారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల పరిశీలన


నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

వాజేడు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీకాంత్ నాయుడు, హౌసింగ్ ఏఈ ఇషాక్ హుస్సేన్ పరిశీలించారు. లబ్ధిదారులు త్వరగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని వారు సూచించారు. అలాగే ఇందిరమ్మ మోడల్ ఇంటికి శ్రీకాంత్ నాయుడు, ఇషాక్ హుస్సేన్ ముగ్గు పోయించారు.నెల రోజుల్లో ఇంటిని పూర్తి చేయనున్నట్లు వారు తెలిపారు.

ఎమ్మార్పీఎస్‌తోనే ఎస్సీల వర్గీకరణ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ములుగు రూరల్ : జిల్లా కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దండోరా జెండాను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు తడుగుల విజయ్ ఆవిష్కరించారు. అనంతరం మంద కృష్ణ మాదిగ పుట్టిన రోజు సందర్భంగా కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ మాదిగ దండోరా ప్రస్థానం 31ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేసి ఎస్సీ వర్గీకరణ సాధించిందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గజ్జల ప్రసాద్, పేరాల బలరాం, కడపాక శ్యామ్, అంబాల చంద్రమౌళి, భద్రు నాయక్, గజ్జల ప్రశాంత్, సమ్మన్న, రవీందర్ తదితరులు ఉన్నారు.


వెంకటాపురం(కె): మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి మల్లికార్జునరావు


తాడ్వాయి: ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు

కనీస వేతన చట్టం అమలు చేయాలి


ఏటూరునాగారం: బస్టాండ్‌లో మానవహారంగా ఏర్పడి నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

తమకు కనీస వేతన చట్టం అమలు చేయాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని కార్మిక నాయకులు డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో భాగంగా బుధవారం జిల్లా వ్యాప్తంగా కార్మికులు ర్యాలీలు నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తు కార్పొరేట్ కంపెనీలకు వత్తాసు పలుకుతోందని ఆరోపించారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాలను తహసీల్దార్లకు అందజేశారు. ఏఐటీయూసీ, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, జీపీ సిబ్బంది, మధ్యాహ్న భోజన కార్మికులు, ఆదివాసీ గిరిజన సంఘం, తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయీస్ పాల్గొన్నారు. - సాక్షి నెట్‌వర్క్


వెంకటాపురం(ఎం): తాళ్లపాడులో..


మంగపేట: ఆశ కార్యకర్తలు, అంగన్‌వాడీల ర్యాలీ..


ఏటూరునాగారం: మాట్లాడుతున్న దావూద్


వాజేడు: పేరూరు బ్యాంకు వద్ద సమ్మె చేస్తున్న ఉద్యోగులు


వాజేడు: ర్యాలీ నిర్వహిస్తున్న కార్మికులు


వాజేడు: తహసీల్దార్ కార్యాలయంలో..

‘దాడి చేయడం సరికాదు’


ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్ఎంపీలు

టేకుమట్ల : కొన్ని రోజులుగా ప్రథమ చికిత్స కేంద్రాలపై డీఎంహెచ్‌ఓ, తెలంగాణ మెడికల్ అసోసియేషన్ సంయుక్తంగా దాడులు చేయడం సరైంది కాదని ఆర్ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కత్తి సంపత్ అన్నారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిత్యం గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక చికిత్స అందిస్తున్న వారిపై కక్ష పూరితంగా దాడులు నిర్వహించడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆర్ఎంపీలకు శిక్షణ ఇచ్చి ప్రాథమిక చికిత్స కేంద్రాల నిర్వాహణకు సహకరించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావుకు ఆర్ఎంపీల ప్రథమ చికిత్స కేంద్రాలపై దాడులు నిలిపి వేయాలని వినతిపత్రాన్ని అందించారు.

మంత్రి సీతక్క జన్మదిన వేడుకలు


మంత్రి సీతక్కను సన్మానిస్తున్న జిల్లా అధ్యక్షుడు అశోక్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవిచందర్

సాక్షి నెట్‌వర్క్ : తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ,శిశు సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ ధనసరి సీతక్క జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్‌లు గజమాలతో సత్కరించారు. జిల్లా నలుమూలల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు , అభిమానులు అధిక సంఖ్యలో హాజరై మంత్రి సీతక్కకు పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ పార్టీ కోసం కార్యకర్తలు , నాయకులు కష్టపడి పని చేయాలని సూచించారు. పార్టీ కోసం కష్టపడిన వారికి పదవులు దక్కుతాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో కార్యకర్తలు ముందుండాలని సూచించారు. నాయకులు ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కారం కోసం పాటుపడినప్పుడే ప్రజలకు చేరువ అవుతారని అన్నారు. మార్కెట్ కమిటీ నిబంధనల మేరకు నియమించామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని సామాజికవర్గాలకు న్యాయం చేసే విధంగా పని చేస్తుందని అన్నారు. రాబోయే ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేసి పార్టీని గెలిపించుకోవాలని అన్నారు.


వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్లు

మెగా వైద్యశిబిరం

ఏటూరునాగారం : మంత్రి సీతక్క జన్మదిన సందర్భంగా ఉద్యోగ జేసీపీఆర్ ఆర్ చారిటీ ట్రస్ట్ వ్యవస్థాపకుడు మడుగురి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో బుధవారం మండల కేంద్రంలోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణ స్థలంలో మెగా హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ క్యాంపులో సుమారు 500 మందికి వైద్య పరీక్షలు, అవసరమైన వారికి ఈసీజీ నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మడుగురి సుధాకర్, సంధ్య, పాలకుర్తి శ్రీనివాస్, సంజీవ్ గుల్లగట్టు, సంజీవ్, సత్యం పాల్గొన్నారు.

నేడు దత్త జయంతి

కాళేశ్వరం : మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం అనుబంధ దేవాలయమైన శ్రీ దత్తాత్రేయస్వామి ఆలయంలో గురువారం గురుపౌర్ణమి సందర్భంగా దత్తజయంతి పూజలు నిర్వహించున్నట్లు ఈఓ మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలన్నారు.

రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

భూపాలపల్లి రూరల్ : భూపాలపల్లి మండలం జంగేడు, గొర్లవీడు, వజినేపల్లి, నేరేడుపల్లి గ్రామాల్లో భూమి పట్టా పాస్‌పుస్తకాలు పొందిన రైతులు ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వ్యవసాయ శాఖ జంగేడు క్లస్టర్ వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీకన్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ లేనిచో కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలకు అర్హులు కారని పేర్కొన్నారు. రైతులు తమ ఆధార్ కార్డుతోపాటు , పట్టా పాస్ పుస్తకం తీసుకురావాలన్నారు. మరిన్ని వివరాలకు 89777 68745కు ఫోన్ చేయాలన్నారు.

క్లుప్తంగా

డ్రైయినేజీలో దిగబడిన టిప్పర్



ఎస్ఎస్‌తాడ్వాయి : మండల కేంద్రంలో నిర్మించిన డ్రైయినేజీపై నుంచి కంకర టిప్పర్ వెళ్లడంతో డ్రైయినేజీ ధ్వంసమైంది. నూతనంగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనం ఎదుట డ్రైయినేజీ కాల్వ నిర్మించగా పనుల నిమిత్తం కంకర లోడుతో టిప్పర్ వెళ్లగా డ్రైయినేజీ ధ్వంసమై అందులో కురుపోయింది. నిబంధనల మేరకు స్టీల్ వేయకపోవడమే కారణమని స్థానికులు ఆరోపిస్తున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిక



ఎస్ఎస్‌తాడ్వాయి : మండలంలోని మేడారం సమీపంలో గల రెడ్డిగూడెం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండల మాజీ అధ్యక్షుడు ఎనగందుల బాపిరెడ్డి బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్, గౌరవ అధ్యక్షుడు జాలపు అనంతరెడ్డి, మాజీ ఎంపీటీసీ బత్తిని రాజు సమక్షంలో జిల్లా కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో పార్టీలో చేరగా మంత్రి సీతక్క పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఏబీవీపీ నాయకుల ర్యాలీ



ములుగు రూరల్ : ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలను జిల్లా శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ఎదుట వరంగల్ విభాగ్ మంత్రి గుండు పృథ్వీ ఏబీవీపీ జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం


నారాయణపూర్ ఎర్రం చెరువు వద్ద మృతదేహం

వెంకటాపురం(ఎం) : వెంకటాపురం(ఎం) మండలంలోని నారాయణపూర్ శివారులోని ఎర్రం చెరువు వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం బుధవారం లభ్యమైందని ఎస్సై చల్లా రాజు తెలిపారు. ఎర్రచెరువు వైకుంఠధామం వద్ద గుర్తు తెలియని మృతదేహం ఉందని స్థానికుల నుంచి సమాచారం అందిందని తెలిపారు. మృతుడి ఆచూకి తెలిసిన వారు వెంకటాపురం(ఎం) పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందించాలని సూచించారు. సమాచారం 8712670083కి అందించాలని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టులు



టేకుమట్ల : చాలా ఏళ్ల క్రితం మండలంలోని పలు గ్రామాల్లోని ప్రధాన రోడ్లపై నిర్మించిన లోలెవల్ కల్వర్టులు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో వాహనదారులు, ప్రయాణికులు వెళ్లాలంటే భయపడుతున్నారు. పాకురు పట్టి కొన్ని కల్వర్టులు ప్రమాదకరంగా మారాయి. ప్రధానంగా చిట్యాల–టేకుమట్ల ప్రధాన రహదారిలో నాలుగు లోలెవల్ కల్వర్టులు నిత్యం భారీ వాహనాల రాకపోకలతో పూర్తిగా శిథిలమైంది. పగలు, రాత్రి తేడా లేకుండా నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే ప్రధాన రహదారిలోని కల్వర్టులు ధ్వంసమైనా ఇప్పటి వరకు అధికారులు వాటి నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడం దారుణమని స్థానికులు అంటున్నారు. టేకుమట్ల శివారులోని టేకులకుంట వద్ద గల కల్వర్టు వర్షాకాలంలో వరదకు మరింత కోతకు గురికాగా కొందరు కల్వర్టు దాటే క్రమంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. అలాగే కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయం సమీపంలోని కల్వర్టు మధ్యలో శిథిలం కావడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. శాంతినగర్ శివారులో ఉన్న కల్వర్టు ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రయాణికులు మరింత ఆందోళన చెందుతున్నారు.

కుంగుతున్న అంకుషాపూర్–టేకుమట్ల లోలెవల్ కల్వర్టు..

టేకుమట్ల–అంకుషాపూర్ లోలెవెల్ పై నుంచి వచ్చే వరద వల్ల కల్వర్టుపై పాకురు పట్టి వాహనదారులు ప్రయాణించే సమయంలో జారిపడిన సంఘటనలు కోకొల్లాలు. కాలినడకన వెళ్లే వారు సైతం జారి పడుతున్నారు.